
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAYNEWS.COM
16-5-2026 (Saturday) MAIN EDITION

## పలు జిల్లాలకు వర్ష సూచన



**అక్షరటుడే, హైదరాబాద్ :** పలు జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. నాగర్ కర్నూల్, గద్వాల్, రంగారెడ్డి జిల్లాలో శనివారం సాయంత్రం వాన పడే ఛాన్స్ ఉందని పేర్కొన్నారు. వేళ భారీగా ఈదురుగాలులు వీస్తాయన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హైదరాబాద్ నగరంలో శంషాబాద్, మహేశ్వరం ప్రాంతాల్లో వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

## నర్సును మోసం చేసిన వైద్యుడు



**అక్షరటుడే, విజయవాడ:** విజయవాడలో ఓ వైద్యుడిపై తీవ్ర ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. తనకు ఇప్పటికే వివాహమైన విషయం దాచిపెట్టి, ప్రేమ పేరుతో ఓ నర్సుతో సహజీవనం చేసి మోసం చేశాడని బాధితురాలు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వైద్యుడు తన ఆస్పత్రిలో పనిచేస్తున్న నర్సుతో పరిచయం పెంచుకున్నాడు. ప్రేమ పేరుతో ఆమెకు దగ్గరై, తనకు వివాహం కాలేదని నమ్మించాడు. దాదాపు నాలుగేళ్ల పాటు ఆమెతో కలిసి జీవించాడు. అంతేగాకుండా ఆమెకు రెండు సార్లు అబార్షన్ చేయించాడు. అయితే అతడికి పెళ్లి అయిందని తెలియడంతో ఆ నర్సు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## నిమ్స్‌లో కిడ్నీ రాకెట్ అని ప్రచారం



అక్షరటుడే, హైదరాబాద్ : నిమ్స్‌లో కిడ్నీ రాకెట్ అంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోందని డైరెక్టర్ బీరప్ప తెలిపారు. అసత్య ప్రచారాన్ని నమ్మొద్దని కోరారు. కిడ్నీ ఆపరేషన్ పేరుతో డబ్బులు తీసుకున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగిపై పేషెంట్ ఫిర్యాదు చేశారన్నారు. విచారణ తర్వాత ఉద్యోగిని విధుల్లో నుంచి తొలగించామన్నారు.

## ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ: రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లోనే తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, అమరవీరుల కుటుంబాలకు సమరయోధుల పెన్షన్లు ఇవ్వాలని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. ఉద్యమకారుల గుర్తింపునకు వేసిన కమిటీలో మహిళకు అవకాశం ఇవ్వకపోవడంపై విమర్శలు చేశారు.

## వృద్ధ మహిళల దారుణ హత్య




అక్షరటుడే, హైదరాబాద్ : నగర శివారులోని మొయినాబాద్‌లో గల ఓ ఫామ్‌హౌస్ సమీపంలో దారుణ ఘటన వెలుగు చూసింది. ఇద్దరు వృద్ధ మహిళలను దుండగులు దారుణంగా హత్య చేశారు. వారిని తాండూరులో కిడ్నాప్ చేసి హత్య శారు. అనంతరం మొయినాబాద్ ఫామ్‌హౌస్ దగ్గర పెట్టారు.

## నీట్ పేపర్ లీకేజీ.. మరో నిందితుడి అరెస్ట్

**అక్షరటుడే, ఢిల్లీ:** నీట్ పరీక్ష బయాలజీ ప్రశ్నపత్రాల లీకేజీకి మూలమైన మరో ప్రధాన సూత్రధారిని సీబీఐ గుర్తించింది. మహారాష్ట్రలోని పూణేకు చెందిన సీనియర్ బోటనీ టీచర్ మనీషా గురునాథ్ మంధారేను సీబీఐ విచారించిన అనంతరం ఢిల్లీలో అరెస్టు చేసింది. ఆమె నీట్ యూజీ 2026 పరీక్ష ప్రక్రియలో పాలుపంచుకుని, ఎన్‌టీఏ చేత నిపుణురాలిగా నియమితురాలు అయ్యారు. ఆమెకు బోటనీ మరియు జువాలజీ ప్రశ్నపత్రాలపై పూర్తి యాక్సెస్ ఉండేది. ఏప్రిల్ 2026లో ఆమె పూణేకు చెందిన మనీషా వాఘ్మారే ద్వారా నీట్ పరీక్ష రాయబోయే అభ్యర్థులను సమీకరించి, తన పూణే నివాసంలో ఈ విద్యార్థుల కోసం ప్రత్యేక కోచింగ్ తరగతులు నిర్వహించింది. ఈ తరగతులలో ఆమె బోటనీ, జువాలజీ సబ్జెక్టుల నుంచి వచ్చే ప్రశ్నలను విద్యార్థులకు వివరించింది.

## 20న దేశవ్యాప్తంగా మెడికల్ షాపుల బంద్

**అక్షరటుడే, ఢిల్లీ :** దేశవ్యాప్తంగా ఈ నెల 20న మెడికల్ షాపుల బంద్ నిర్వహించనున్నారు. ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలను వ్యతిరేకిస్తూ ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ బంద్‌కు పిలుపునిచ్చింది. కోవిడ్ సమయంలో కేంద్రం ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయాలని డిమాండ్ చేసింది. ఆన్‌లైన్‌లో నకిలీ, ప్రమాదకర మందులు సరఫరా చేస్తున్నారని అసోసియేషన్ ఆరోపించింది. ప్రజల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకుని ఆన్‌లైన్ సేవలకు ఫుల్‌స్టాప్ పెట్టాలని డిమాండ్ చేసింది. బంద్ నేపథ్యంలో 12.40 లక్షలకు పైగా మెడికల్ షాపులు మూత పడనున్నాయి.

**బండి భగీరథ్‌పై పోలీసులు లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. ఓ అమ్మాయిని లైంగికంగా వేధించాడనే ఆరోపణలతో ఆయనపై పోక్సో కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. భగీరథ్ పరారీలో ఉండటంతో పోలీసులు నోటీసులు జారీ చేశారు. నాలుగు బృందాలతో అతడి కోసం గాలిస్తున్నారు. హైదరాబాద్, కరీంనగర్‌లోని ఆయన తండ్రి నివాసంలో సోదాలు చేశారు.**

–అక్షరటుడే, హైదరాబాద్



# బండి భగీరథ్‌పై లుకౌట్ నోటీసులు

■ దేశం విడిచి వెళ్లకుండా చర్యలు ■ నాలుగు బృందాలతో గాలింపు

భగీరథ్‌పై హైదరాబాద్ నగరంలోని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు అయింది. ఈ నెల 8న కేసు నమోదు కాగా.. విచారణ కోసం ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. అయితే భగీరథ్ అప్పటి నుంచి పరారీలో ఉన్నాడు. అతడి ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉంది. విచారణకు హాజరు కావాలని పోలీసులు నోటీసులు జారీ చేసినా.. ఆయన స్పందించలేదు. ఈ క్రమంలో తాజాగా పోలీసులు లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు.

### 4 బృందాలతో గాలింపు

పోక్సో కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని బండి భగీరథ్ హైకోర్టులో పిటిషన్ వేశారు. అయితే బెయిల్ ఇవ్వడానికి కోర్టు నిరాకరించింది. దీంతో హైదరాబాద్ నుంచి పారిపోకుండా పోలీసులు చర్యలు తీసునకున్నారు. ఏ ఎయిర్‌పోర్టులో కనిపించిన వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. నిందితుడి కోసం 4 టీమ్స్ ఏర్పాటు చేసి ముమ్మరంగా గాలిస్తున్నారు. కాగా కోర్టు బెయిల్ పిటిషన్ కొట్టివేయడంతో ఒకటి రెండు రోజుల్లో భగీరథ్ లొంగిపోనున్నట్లు సమాచారం. బంజారాహిల్స్ లోని బండి భగీరథ్ తండ్రి ఇంటికి వెళ్లి పోలీసులు తనిఖీలు చేశారు. కరీంనగర్‌లో సైతం సోదాలు చేపట్టారు.

## నాందేడ్–ధర్మవరం వీక్లీ ఎక్స్‌ప్రెస్ క్రమబద్ధీకరణ

**అక్షరటుడే, హైదరాబాద్:** నిజామాబాద్ జంక్షన్ మీదుగా నడుస్తున్న 07189/90 నాందేడ్- ధర్మవరం వీక్లీ ప్రత్యేక ఎక్స్ ప్రెస్ రైలును క్రమబద్ధీకరిస్తూ దక్షిణ మధ్య రైల్వే జోన్ నాందేడ్ డివిజన్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ రైలు పెద్దపల్లి వరంగల్ విజయవాడ గూడూరు తిరుపతి పాకాల మీదుగా ధర్మవరం వెళ్తుంది. క్రమబద్ధీకరించిన తర్వాత ఎక్స్ ప్రెస్ రైలు నంబర్ 17636/35గా మారింది. నాందేడ్ -ధర్మవరం వీక్లీ ఎక్స్ ప్రెస్ రైలు ప్రతి శుక్రవారం నిజామాబాద్ జంక్షన్‌కు సాయంత్రం 6:58 గంటలకు వచ్చి 7 గంటలకు బయలుదేరుతుంది. రెండు నిమిషాలు హాల్ట్ సౌకర్యం ఉంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు ప్రతి ఆదివారం ధర్మవరంలో ఉదయం 05:25 గంటలకు బయలుదేరి, తిరుపతి రైల్వే స్టేషన్‌కు ఉదయం 10:30 గంటలకు వచ్చి 10:40 నిమిషాలకు బయలుదేరుతుంది, సోమవారం ఉదయం 4 గంటలకు నిజామాబాదు జంక్షన్‌కు వచ్చి 4:05 నిమిషాలకు బయలుదేరుతుంది.




## స్త్రీనిధితో మహిళల ఆర్థిక స్వావలంబన : సీతక్క




**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** ప్రజాభవన్‌లో స్త్రీనిధి వార్షిక కార్యాచరణ ప్రణాళిక అమలు కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ.. స్త్రీనిధి సంస్థ మన ఇల్లు లాంటిదన్నారు. సంస్థను కాపాడుకుంటేనే ఉద్యోగుల హక్కులు, భవిష్యత్తు సురక్షితంగా ఉంటాయని చెప్పారు. 2011లో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన స్త్రీనిధి, నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో మరింత బలోపేతం అవుతోందన్నారు. మైక్రో ఫైనాన్స్ సంస్థలు, అధిక వడ్డీ వ్యాపారుల బారిన పడుతున్న మహిళలను ఆదుకోవడానికే స్త్రీనిధి ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటివరకు స్త్రీనిధి ద్వారా 32 లక్షల మందికి పైగా మహిళలకు రూ.24 వేల కోట్ల రుణాలు అందించినట్లు మంత్రి పేర్కొన్నారు.

## పిల్లలే మన సంపద : చంద్రబాబు




**అక్షరటుడే, ఏపీ:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేశారు. మూడో బిడ్డను కంటే రూ.30 వేలు, నాలుగో బిడ్డకు జన్మనిస్తే రూ.40 వేలు ఇస్తామని ప్రకటించారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో సీఎం చంద్రబాబు శనివారం పర్యటించారు. స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనాభా తగ్గుదలపై ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జనాభా తగ్గుదల సమస్యగా మారిందని పేర్కొన్నారు. పిల్లలు భారం కాదు.. వాళ్లే మన సంపద అన్నారు. మూడో బిడ్డ పుట్టిన వెంటనే ఆ దంపతులకు రూ.30 వేలు, నాలుగో బిడ్డను కంటే రూ.40 వేలు వెంటనే ఇస్తామని ప్రకటించారు.

## భారీ ఆఫర్ వదులుకున్న త్రిష

**హీరోయిన్ త్రిష భారీ ఆఫర్‌ను వదులుకున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. కమల్ హాసన్, రజనీకాంత్ నటిస్తున్న మల్టీ స్టారర్ సినిమాలో త్రిష కూడా యాక్ట్ చేస్తున్నట్లు గతంలో వార్తలు వచ్చాయి. అయితే తాజాగా ఆ ప్రాజెక్ట్ నుంచి ఆమె తప్పకున్నట్లు తెలుస్తోంది. రూ.12కోట్లు ఆఫర్ చేసినప్పటికీ ఆమె ఈ సినిమాలో నటించేందుకు ఆసక్తి చూపలేదని సమాచారం. కాగా ఈ సినిమాను నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కిస్తున్నారు.**

- అక్షరటుడే, సినిమాడెస్క్



## బోరుబావిలో పడిన మనవడు.. కాపాడబోయి తాత మృతి




**అక్షరటుడే, నల్గొండ:** బోరుబావిలో పడిన మనవడిని కాపాడడానికి వెళ్లిన తాత మృతి చెందాడు. ఈ విషాద ఘటన నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలంలో చోటు చేసుకుంది. మిర్యాలగూడ మండలం ఊట్లపల్లికి చెందిన వెంకన్న (53) శనివారం ఉదయం తన నాలుగేళ్ల మనవడితో కలిసి వ్యవసాయ పొలం వద్ద మామిడి చెట్లకు నీరు పట్టడానికి వెళ్లాడు. అయితే అక్కడ రన్నింగ్‌లో ఉన్న బోరు కుంగిపోయింది. వెంకన్న మనవడు ఆడుకుంటూ వెళ్లి ఆ బోరు బావిలో పడిపోయాడు. గమనించిన వెంకన్న కాపాడడానికి వెళ్లి బావిలో పడిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. ఓ వ్యక్తికి తాడు కట్టి లోనికి పంపించారు. ఆ వ్యక్తి మొదట వెంకన్నను బయటకు తీశాడు. అనంతరం బాలుడిని రక్షించాడు. అయితే వారిని ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గ మధ్యలో వెంకన్న చనిపోయాడు. బాలుడు సురక్షితంగా బయట పడ్డాడు.

## నకిలీ యాప్‌ల్లో ఐపీఎల్ టికెట్స్.. సీపీ సజ్జనార్ హెచ్చరిక



**అక్షరటుడే, హైదరాబాద్:** దేశవ్యాప్తంగా ఐపీఎల్ సందడి నెలకొంది. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో ఈ నెల 22న సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌కు క్రేజ్ ఉండడంతో ఇప్పటికే ఎస్ఆర్‌హెచ్ మేనేజ్‌మెంట్ టికెట్ రేట్లను భారీగా పెంచింది. దీంతో ఈ క్రేజ్‌ను కొందరు సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. నకిలీ యాప్‌లు, వెబ్‌సైట్ల ద్వారా దోపిడీకి తెరలేపారు. అధికారిక టికెటింగ్ భాగస్వామి అయిన 'డిస్ట్రిక్ట్' యాప్‌ను పోలిన రంగులు, లోగోలతో ఉన్న నకిలీ యాప్‌లను సృష్టించి, తక్కువ ధరకే టికెట్లు ఇస్తామంటూ ప్రకటనలు ఇస్తున్నారు. అసలు యాప్‌ను తలపించేలా ఉన్న ఈ నకిలీ లింకులను క్లిక్ చేసి టికెట్లు బుక్ చేసుకుంటే, మీ సొమ్ము గల్లంతవ్వడం ఖాయం. పేమెంట్ చేసిన తర్వాత టికెట్లు రాకపోగా, మీ బ్యాంకింగ్ వివరాలు సైబర్ నేరగాళ్ల పరమయ్యే ప్రమాదం ఉందని సీపీ సజ్జనార్ హెచ్చరించారు.

## నడిరోడ్డుపై పావలా శ్యామల..



**అక్షరటుడే, హైదరాబాద్ :** సీనియర్ నటి పావలా శ్యామల ప్రస్తుతం తీవ్ర ఆరోగ్య సమస్యలతో పోరాడుతున్నారు. ఇటీవల గుండె సంబంధిత సమస్యల కారణంగా కూకట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిని ఆశ్రయించారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్య పరీక్షలు, చికిత్స కోసం ఆమె అక్కడికి వెళ్లినట్లు తెలుస్తోంది. చికిత్స అనంతరం అర్ధరాత్రి సమయంలో ఆమె ఇంటికి బయలుదేరిన సమయంలో ప్రయాణిస్తున్న క్యాబ్ డ్రైవర్, కూకట్‌పల్లి వై జంక్షన్ సమీపంలో ఆమెను దింపి వెళ్లిపోయినట్లు సమాచారం. నిస్సహాయ స్థితిలో ఫుట్‌పాత్‌పై ఉన్న ఆమెను అటుగా వెళ్తున్న స్థానికులు గుర్తించారు. పోలీసులు ఆమెను ఆర్కే ఫౌండేషన్‌కు తరలించారు.

## టిప్పర్ ఢీకొని ఉపాధి కూలీల మృతి

**అక్షరటుడే, ఏపీ:** టిప్పర్ ఢీకొని ఉపాధి హామీ కూలీలు మృతి చెందారు. ఈ ఘటన కాకినాడ జిల్లా కొవ్వూరు బ్రిడ్జి సమీపంలో శనివారం ఉదయం చోటు చేసుకుంది. ఉపాధి హామీ పనుల్లో పాల్గొనేందుకు కొందరు మహిళా కూలీలు ఇళ్ల నుంచి బయలుదేరారు. వారు కొవ్వూరు బ్రిడ్జి వద్ద రోడ్డు దాటుతుండగా.. అదే సమయంలో అటుగా అత్యంత వేగంగా వచ్చిన టిప్పర్ లారీ నియంత్రణ కోల్పోయి కూలీలపైకి దూసుకెళ్లింది. దీంతో నలుగురు మృతి చెందగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.